

# ఏదీ స్త్రీ హృదయం?!

సత్యవాడ సోదరీమణులు

**అ**మ్మికి మాత్రం తెల్లవారకపోతేనే బావుండు ననిపిస్తోంది. తెల్లారిపోతే ఏముంది? పనిలోకి వెళ్ళమని తల్లి పోరు. నిన్న మొన్నటి సంఘటనలన్నీ నెమరేసుకుంటే తనకు తెలియకుండానే దుఃఖం వస్తోంది. అసలు తను పనిలోకి వెళ్లగలదా? తన బాధేంటో పాతబడి చిరుగులు పట్టిన బొంతను ముసుగుగా చుట్టేసుకుని తన కన్నీళ్లు ఆ బరువు బొంతలోనే ఇంకిపోనిస్తోంది.

అమ్మికి పదహారేళ్లు నిండా లేవు. దానికేదో పది జన్మల అనుభవం అనుభవించేసినంత భారంగా ఉంటోంది. నాలుగిళ్ళల్లో కాదు, పది ఇళ్ళల్లో పనిచేయగల చురుకైన పిల్ల. బద్ధకం, సోమరితనం దరిదాపుకే రానివ్వదు. కాని ఇప్పుడు తల్లి పనిలోకి వెళ్లమంటుందని భయం. భయమే కాదు. తనకి వణుకు కూడా పుట్టుకొస్తోంది. ఆరేళ్ళు నిండకముందే తల్లితో పాటూ తనూ పాచి పనులకు వెళ్లేది. తల్లి కల్లాపు జల్లితే అమ్మి చిట్టి చేతులు ముగ్గులు దిద్దేవి. అమ్మ ఇల్లు చిమ్మితే అమ్మి తొక్కులు పారబోసేది. తల్లి తోమిన పాత్రల్ని తన లేత చేతులతో కడిగేది. పదేళ్ళుగా ఈ పనులన్నీ అలవాటయిపోయిన ఆ పసిడి మొగ్గ ఈవేళ పనిలోకి వెళ్ళడానికి దుఃఖపడుతోంది. అవును అమ్మి ఇప్పుడు పసి మొగ్గ కాదుగా. రేకులు వికసిస్తున్న యౌవ్వనవనంలో అడుగుపెట్టిందామె. నాలుగు రోజుల క్రితం తన ఓణీ చీలికలయితే "అయ్యో" అనుకుంది. అమ్మకి చూపి "ఇప్పుడెలా?" అంది. అయ్యతో ఒక కొత్తది "ఒట్టుకు రమ్మం"ది. నిన్నా, మొన్నా ఎన్ని అవస్థలు పడిందని, అరగంటలో ముగించ వలసిన పని గంట పట్టేసింది. చురుకుపాలు తగ్గించి క్షణ క్షణం చిరిగిన తన ఓణీనే చూసుకుంటూ జాగ్రత్తపడటం, ఓ ఇంటి పని తెముల్చుకొని మరో ఇంటికి వెళ్ళేసరికి ఆ యజమానురాలు చేత చీవాట్లు. ఒక్క ఆలస్యమైనందుకే కాదు, చిరుగుల ఓణీ వేసుకున్నందుకు కూడా. ప్రక్కామెతో అంది. "ఇలాంటి దరిద్రపు మొహాల్ని అసలు పనిలో పెట్టుకోకూడదండీ." ఆ మాటలకు ఆవిడ ఊరుకున్నా అమ్మి కింత మనస్థాపం ఏం ఉండేది కాదు.



"కావాలనే చిరిగింది సింగారించింది. మా అబ్బాయి వస్తున్నాడుగా. అందుకని. పోనీ! ఇద్దరం కలిసి పని మాన్పించేద్దాం."

ఆ సంభాషణ వింటూ అమ్మి కళ్ళు ఎంత వర్షించిందీ వాళ్ళు గమనించలేదు. అందుకే ఆ తర్వాత అమ్మతో అంది. ఇక పనిలోకి వెళ్ళనని. తల్లి దాని మాట పట్టించుకోలేదు.

"ఏటే! తిని కూకుంటే ఎట్టా గడుత్తాది నేను పదిళ్ళ కాడ సేత్తే నువ్వు నాలుగిళ్ళకాడేగా సేత్తున్నావ్ ఓటోతేదీవ చ్చాక ఓణీ ఏం కర్మ సీరే కొని పడేస్తా. సీరలే కడ్డువుగాని."

"ఇయాల ఇంకా పదో తేదీ. ఇరవై నాళ్ళుంది" అమ్మి గొంతు పెగుల్చుకుంది.

"మాటకి మాట సెప్తావేటే? ఎట్టాగో సేసుకో. పని మానేస్తే పైసలెట్టా వొత్తాయి?"

తల్లి మాటలు అమ్మి చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి. మళ్ళీ వినిపించింది ఆ ఉరుముల మోత.

"ఏటే! మొత్తంగా బొంతే ముసుగెట్టేసినావు నెగు. నేసి పన్లోకెల్లు. ఎంత పొద్దెక్కి పోనాదో సూసావా? సిన్నోలైనా, సిన్నా, బుచ్చి చూడు అప్పుడే పన్లోకెళ్ళేసినారు. ఆళ్ళని సూసి బుద్ధి తెచ్చుకో."

అమ్మి ముసుగు తీసింది. కూర్చొని ఆలోచిస్తోంది. తనా బుద్ధి తెచ్చుకోవలసింది. చెల్లెళ్లు పన్లోకి వెళ్లిపోయారట. తను బద్దకిట్టిదట. ఆల్లేడ? తనేడ? ఆళ్ళింకా సిన్నోళ్ళు. ఆల్నెవరూ ఇట్టాటి మాటలనరు. తల్లి పనిలోకెళ్ళిపోయినా అమ్మి కదలలేక పోతోంది. పాతదైనా ముతకదైనా ఓ ఓణీ ఉంటే బావుణ్ణు.

"ఏటే బుల్లీ! అమ్మి పన్లోకి పోనేదా?" అడిగింది కామమ్మ. బుల్లి అడ్డంగా తల ఊపింది.

"ఈ మద్దిని ఇది సరిగ్గా సెప్పిన మాట యినకుంటా ఉంది. నాలుగంటిం చాల" తన ఊహకి తనే ఉలిక్కిపడింది. అమ్మి ఎందుకు పన్లో కెళ్ళనంటోందో తనకి తెలీదా. తెలిసినా తనేటీ సెయ్యనేదు. పెద్ద కూతుర్ని తలచు

కుంటే కామమ్మ కళ్ళల్లో నీళ్లు నిలిచేయి. "ఏటో! తనూ! తన బతుకూ! ఇంతమంది బొట్టెట్టుకొచ్చేరు. బొట్టెలు బొట్టెల్లానే ఉంటారా? పెద్దోళ్ళవుతున్నారు. అందరూ ఆడకూతుల్లే తన కర్మ! తలరాత! తలరాతైతే ఆ రాత, ఆ రాత రాసిందతనే. మనువైన తొలి రోజుల్లోనే అతను భార్యతో అనేవాడు. మనకి కొడుకు పుట్టాలని, ఎవరైతేనేం? కావలసింది కడుపు పండటం అని కామమ్మ అంటే ఒప్పేవాడు కాదు. కామమ్మ తొలి కాన్పు ఆడపిల్లయితే అసహ్యించుకున్నాడు. తండ్రి ఆదరణకు నోచని బిడ్డ తల్లి లాలన మాత్రం ఏమంత పొందకలుగుతుంది? ఆ దంపతుల సంతానమంతా నిజంగానే గాలికి పుట్టి ధూళికి పెరుగుతున్నట్టే ఉన్నారు. కామమ్మకి ఆపేక్ష అయితే వుంది. కడుపు తీపి లేక పోలేదు. లేనిదల్లా డబ్బూ, ఓపిక. ఉన్నంతలో పిల్లల్ని బాగానే పెంచాలనుకుంటుంది. ముద్దూ ముచ్చటా లేకపోయినా, కూడూ గుడ్డా లేక తన పిల్లలు ఏడవకూడదనుకుంది. కాని ఇప్పుడా పరిస్థితే ఎదురవుతోంది. అమ్మి ఎందుకేడుస్తుంది? తనని తనే ప్రశ్నించుకొని ఆవేదన పడుతోంది. ఆ బాధ కనకయ్యకు లేదు. ఇంటినిండా పిల్లలని అతగాడికి గుడిసెకి రావటమే చిరాకు. కూలినాలి చేసుకోవటం, సావాసగాళ్ళతో గడపటం. అదే అతని దినచర్య.

ప్రతిసారీ కామమ్మ నీళ్ళోసుకున్నప్పుడు కొడుకు కోసం ఎదురు చూస్తాడు. ఆడపిల్లైతే తప్పంతా పెళ్ళాందే. అంతెత్తు ఎగిరిపడతాడు. దాంతో నీరుగారిపోయిన కామమ్మ వాళ్ళని పేరు పెట్టి పిలవాలని కూడా అనుకోలేదు. అమ్మీ, చిన్నీ, బుల్లి, బుచ్చి చిట్టీ, చంటి ఇవే వాళ్ల పేర్లు. కామమ్మ ఏ ఇంటి పన్లు చేస్తున్నా దాని ఆలోచనల్లో పెద్ద కూతురే నిండిపోయింది.

" ఎర్రి తల్లి! దానికో నంగా నేదు, ఓనీ నేదు. కొత్తయి కొనెట్టి ఎంత కాలమై ఎన్నాళ్ళయి పోనాది. ఈడొచ్చినప్పుడు గావాల. కోటా సీరోటి కొని రెండు పైటోనీలు సేస్త. ఈయాల్టి దాకా అయే. ఎంత జాగర్తో వోడుకుంది. సిరిగితే అయే కుట్టి ఏసుకుంది. సెట్టు కొమ్మన ఎండేసిన ఓణీ, కొట్టాడుకుంటూ ఇటూ అటూ నాగి సిట్టీ, బుల్లి సింపేస్తే ఉన్నొక్కటీ వూడిపోనాది. ఏడుస్తూ కూకోక అమ్మి మాత్రం ఏటి సేస్తది." కామమ్మ గుడిసెకి వెళ్ళేసరికి అమ్మి ఓ వారగా కూర్చొని మళ్ళీ ఓణీ కుట్టుకుంటూంది. పన్లోకి పోకపోయినా ఇంటి పనంతా చేసింది. గుడిసె ముందు శుభ్రం చేసి వంట చేసింది. "అమ్మొచ్చేత్తే తిట్టూరో ఏటో" అనుకున్న అమ్మి మనస్సు చల్లగా, ఆప్యాయంగా కామమ్మ పలకరించటంతో దిగులు తగ్గింది.

"ఏటే వంట సేసేసినావా! కూడు తిందువు పద."

"అమ్మా! ఎట్టాగో అట్టా! నాకో నంగా, వోణీ కావాలే. పండగొత్తోంది కదా అనైనా... సిరిగినవే కట్టుకొని పన్లోకి పోనేను" కూడు తింటూ మళ్ళీ గుణిసింది.

"ఏటే సరేనేవే. ఎట్టాగో నాగ కుట్టేసినావు గందా. మద్దేనం పన్లోకెళ్ళు. కొంటాన్లే" తల్లి నోట మళ్ళీ అదే మాట విన్న అమ్మి మనస్సు చివుక్కుమంది. మధ్యాహ్నం నుంచి పన్లోకెళ్ళక తప్పలేదు.

ఫస్టు తారీఖు వచ్చి వెళ్ళింది. చేతికొచ్చిన పైసలు కాసిన్ని బియ్యం, దినభత్యాలు కొంటానికే సరిపడలేదు. కూతురికి చీరైనా, లంగా అయినా, ఓణీ అయినా ఇంకేం కొంటారు? అమ్మి అవస్థ చూచి మాటైతే అంది కాని, దాని బ్రతుకేమిటో దానికి తెలియదా. అమ్మి పనిలోకి వెళ్తోంది, వస్తోంది. తనకు బట్టలు కావాలని అడిగినప్పుడు అడుగుతోంది. ఒక్కొక్కప్పుడు గొడవ చేస్తోంది. కామమ్మ నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది.తండ్రి ఇవేళా, ఆవేళా, రేపూ అంటూ జరుపులు పెడుతున్నాడు తప్ప కూతురి కనీస అవసరాలను తీర్చే ఆలోచనే అతనికి లేదు. బరువెక్కిన మనస్సుతో నిదానంగా పనిచెయ్యటానికే అలవాటు పడింది.

సావిత్రి అమ్మిని చూస్తూనే మండిపడింది. "పనులు మేం చేసుకోవడం. డబ్బులు నీకియడమేనా. నీ వాలకం రోజు రోజుకీ మితిమీరిపోతోంది. ఇలా అయితే కుదరదు. సెలవులకి టిఫిన్ చేసి పెడదామంటే తమరు ఆఘోరిస్తేనే?" మీద మీదకు ఉరుకుతూ పళ్ళు బిగించి కసిగా తిట్టింది సావిత్రి... అమ్మి మారు మాట్లాడకుండా తన పని చేసుకోసాగింది.

"పాడు వోణీ! తనకెన్ని అవస్థలు తెచ్చి పెడుతోంది? తనకే కనక తన వయస్సుకు తగ్గట్టు సరిపడే బట్టలుంటే చెంగు చెంగున లేడి పిల్లలా దూకుతూ ఎన్నిళ్ళ పనైనా సేసుకు వోయేది."

కూర్చొని పనిచేసి గభ్భున లేస్తూ పటపటలాడుతూ కుట్లు ఊడిపోయే లంగా! ఏం పాపం చేసుకుందో తను. కట్టుకుందికి బట్టలే కరువు. నాన్నకి చెప్పింది. అమ్మనడిగింది. ఏం లాభం. సంపాయిస్తున్నా తన బాధ తనదే. తన పాట్లు తనవే. తన ఈడుదే అయిన చంద్రిక ఎంత హుషారుగా ఉంటుంది. అవును మరి, చంద్రికకు రంగు రంగుల లంగాలు, రకరకాల ఓణీలు తన ఇష్టం వచ్చినట్లు వేసుకొని తిరుగుతుంది. వయస్సుకు తగిన మురిపెం, గంతులేస్తూ ఎప్పుడూ గాలిలో ఎగురుతున్నట్టే ఉంటుంది. తనకో రెండు ఓణీలు వుంటే బావుండును. ఒకటున్నా సరిపోయేది. చంద్రిక గుర్తు రాగానే అమ్మి బుర్రలో ఓ ఊహ తళుక్కుమంది. తన అయ్యనీ, అమ్మనీ అడిగింది కాని చంద్రిక నడిగి చూసిందా! అడిగితే ఎందుకివ్వదు. మరుక్షణం అమ్మి చంద్రిక గదిలోకి వెళ్ళింది. కాలేజీకి బయలుదేరబోతున్న చంద్రిక అందంగా అలంకరించుకొని అద్దం ముందు నిలబడింది.

"చంద్రమ్మా! చంద్రికా"

ఆ పిలుపులో తళుక్కుమంటున్న ఆశ! తరుముకొచ్చే భయం!

చిరాగ్గా చూసింది చంద్రిక.

"చంద్రమ్మా! నువ్వేసుకున్న బట్టలు ఎంతో బావున్నాయి" అప్రయత్నంగానే అనేసింది. అమ్మి చూపులు చంద్రిక ధరించిన లంగా, ఓణీ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. ఆకుపచ్చరంగు, ఎర్రంచుతో ఉన్న పట్టు లంగా, ఆకుపచ్చటి జాకెట్టు, గులాబీ రంగు పువ్వుల ఓణీ, ఆ డ్రస్‌లో చంద్రిక రెమ్మల మధ్య గులాబీ పువ్వులా అంది అమ్మి కళ్ళకి.

"అలా చూస్తావేం? పిలిచావెందుకు? చెప్పి ఏడు. నాకు ఫంక్షనుకు టైం అవుతోంది" ఆ అందాల గులాబీ ఓ ముల్లు విసిరింది. అమ్మి మనస్సుకు గుచ్చుకున్నా బాధ అనిపించలేదు.

"అది కాదు సెంద్రమ్మా మరేం... మరేం.... నీకీ బట్టలెంతో బావున్నాయి."

"అది నువ్వేం చెప్పక్కర్లేదు. వెళ్ళి పని చూసుకో."

"కాదు చంద్రమ్మా! పాతబడినవేనా నాకొక లంగా, ఓణీ ఇవ్వవూ" దీనంగా అడిగింది అమ్మి.

"ఇదా నీ ఏడుపు. నాకూ నా బట్టలకూ దిష్టి పెట్టకు. నీ దిష్టి తగిలిందంటే చిరిగి ఊరుకుంటాయి. నాకుంటే నీకివ్వాలనుందా?"

ఈ ఘర్షణకి అక్కడికొచ్చిన సావిత్రి కూడా కూతురికే తోడయింది. అమ్మినే తిట్టిపోసింది. అడుగులో అడుగేస్తూ అక్కడినించే కదిలింది. చంద్రికనడిగితే తన బట్టల కొరత తీరుతుంది అనుకుంది, అమాయకంగా అమ్మి. తిట్టు, తినాల్సి వస్తుందంటే తన అవస్థ తనదే అని తెలిస్తే నోరెత్తేదే కాదు. తనవి దిష్టి కళ్ళా? నాకుంటే నీకివ్వాలని వుందా అంది చంద్రమ్మ. బోలెడున్నాయి కనక ఒక్కటైనా ఇవ్వకపోతుందా అనుకుంది తను. గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ మిగిలిన పని చూడసాగింది అమ్మి.

"నీ పేరు అమ్మి కదూ?" పనిచేసుకుంటుందన్నదల్లా తలెత్తి చూసింది. ఎదురుగా మధుబాబు.

"అంతగా ఎందుకు దుఃఖపడతావు? ఎల్లుండికల్లా నేతెచ్చి పెడతాలే. నీకు కావలసినవి ఓ లంగా, పూల వోణీగా" ఆ మాట తొలిసారిగా అమ్మి మనస్సుకు గిలిగింతలు పెట్టింది.

"మధుబాబు! మీరు...."

"అవును! నువ్వు చంద్రికనడిగావు. వాటిని నేను తెచ్చిపెడతాను."

"పట్టువి, సిల్కువి నాకేమీ అక్కర్లేదు."

"తెలుసు. నీ బాధ, అవసరం అర్థం చేసుకునే ఇలా అంటున్నాను" మధుబాబు తన గదిలోకి వెళ్ళిపోయాడు. అమ్మి ఇంటికి వెళ్ళిపోయింది.

అతని మనస్సులో అమ్మి నిండిపోయింది. "అమాయకురాలు. ఉత్త

బేల. ఓ జత బట్టలు ఇస్తే పోయేదేముంది? అయినా అమ్మి కొత్తవేమీ అడగలేదు. చంద్రిక కట్టి విడిచినవి ఇచ్చినా సంతోషపడేదే." చెల్లాయి మీద చిరాకు కలిగింది. అమ్మ మీద కోపం వచ్చింది. "పాపం! అమ్మి!" అనుకున్నాడు.

మధుబాబు మాటలు అమ్మి మనస్సులో చేదుని మాయం చేసి మధుధారలు కురిపిస్తున్నాయి. తను మాట మాత్రంగా అయినా తన మనస్సులో బాధ అతనికి చెప్పలేదు. అలాంటిది మధుబాబు తనకు తనే ఎలా తెచ్చిపెడతానన్నాడో? మంచి మనసులు అంటే ఇలాంటివేనేమో. ఇలాంటి వాళ్ళలోనే దేముడుంటాడు" అనుకుంది.

అమ్మి సుతారంగా తలుపు తట్టింది. ఆ రోజు బాగా ఆలస్యం అయినందుకు ఎన్ని చీవాట్లు కాయవలసి వస్తుందో అన్న బెదురు ఆమెలో. అమ్మ గారికి కోపం వస్తే! అమ్మో చంద్రమ్మ విసవిసలైతే చెప్పనే అక్కర్లేదు. తలుపు తెరిచిన వ్యక్తిని చూసి నివ్వెరబోయింది.

"అమ్మ, చంద్రిక లేరు."

"అయితే మళ్ళీ వస్తా...."

"ఫరవాలేదు. పని చేసుకొని వెళ్ళు."

"వత్తా బాబూ! తలుపేసుకోండి" పని పూర్తికాగానే వెనుతిరిగింది.

"ఆగు!" లోపలికి వెళ్ళి పాకెట్‌తో తిరిగి వచ్చాడు. అతని చేతుల్లో సంచి గరగరలాడుతోంది. అమ్మి మనస్సు ఏదో తెలియని భయంతో రెపరెపలాడుతోంది.

"నీకే తీసుకో" పాకెట్ ఆమె చేతుల్లో ఉంచాడు.

లంగా ఓణీ కొత్తవి తనకే. అమ్మికి ఆ సంచీ పెన్నిధిలా కనిపించింది. కాని మరుక్షణం ఆ పనిపిల్ల మనస్సు అల్లకల్లోలమైపోయింది. "ఈ బట్టలు తనకెట్టా వత్తున్నాయి. యారిత్తున్నారు. బాబుగోరు. అమ్మో! తీసుకోవచ్చా! తను ఆడది మధుబాబు మొగోరు. మొగోళ్ళ దగ్గర తీసుకోకూడదు. తప్పు. సెయ్యకూడదు ఇట్టాంటి పని." ఓవైపున ఈ మోస్తరు ఊహలు. ఈ లంగా ఓణీ తనవే అయితే తన పాట్లు గట్టెక్కినట్టే. ఈటి కోసమే కదా ఇన్నాళ్లు తను బాధపడ్డది. ఏడిసింది. తిట్లు కాసింది. ఇయే కనక అమ్మగారో, సెంద్రయ్యో ఇస్తే బాగుండిపోను. ఆ అమ్మలే కాదు, మరే అమ్మ ఇచ్చినా భయమే అక్కర్లేదు. తను, అమ్మ ఎన్నిల్లకాడ పనిసేయటం లేదు? ఆళ్ళలో యే యమ్మ దయతల్చినా తనకీ భయం ఉండేదా? ఇప్పుడు మధుబాబు సిన్నోడే అయినా ఎంత పెద్ద మనసుతో ఇత్తున్నాడు. తను తీసుకోవచ్చా. ఈ మోస్తరు ఆలోచనలు మరోవైపు కసురుకుంటున్నాయి. అమ్మి సన్నని చేతులు కంపిస్తున్నాయి. అమ్మి ముఖంలో రంగులు మారటం స్పష్టంగా తెలుస్తోంది మధుబాబుకి. ఎలాంటి భావాలు ఆ లేత మనస్సును కలవరపెడుతున్నాయో అతని ఊహకందక పోలేదు.

"ఊరికే బెదరిపోతావేం. తీసుకో. అసలు ఇప్పుడే ఈ లంగా, వోణీ వేసుకో చూద్దాం."

"వద్దులే మధుబాబూ. నాకొద్దులే."

"ఫరవాలేదు. ముందు వేసుకో, చక్కగా సరిపోతాయి."

ఆకాశ నీలం రంగు పరికిణీ, జాకెట్టు, నీలం పువ్వుల ఓణీలతో మెరుస్తున్న కళ్ళతో నిల్చున్న అమ్మిని చూస్తుంటే మధుబాబుకి చక్కని సాయం సమయంలో గగనాన్ని చూస్తున్న అనుభూతి కలిగింది. అతని కళ్ళల్లో ఆనంద భాష్పాలు నిలిచేయి. ఆ కళ్ళల్లో కామం లేదు. ఆ కన్నీళ్ళలో కల్మషం లేదు. తను ఒక మంచి పని చేయగలిగేను అన్న సంతృప్తితో మైమరచిపోయాడు. ఒక్కసారిగా అతని పాదాలపై పడ్డ అమ్మిని తృళ్ళిపడి చేతులు పట్టి లేవదీశాడు.

"ఛ! ఛ! ఏమిటీ పని" అని అంటున్నాడో లేదో, అక్కడ ప్రత్యక్షమయింది సావిత్రి.

"మధూ! ఏమిట్రా!" గర్జించింది. మధు అదిరిపడ్డాడు. అమ్మి అచేతనురాలయింది.

"ఈ దెయ్యం ఇక్కడ ధాపురిస్తుందని, ఈ పీడ నిన్ను పట్టుకుంటుందని అప్పుడే అనుకున్నాను. అయినా నీ బుద్ధేం గడ్డితింది. మన పరువు ప్రతిష్ఠలు, వంశ మర్యాద గంగలో కలుపుదామనా ఈ బజారు దాంతో ప్రేమ కలాపాలు - నిన్ను నిలువునా చీల్చినా పాపం లేదురా..." ఆవేశంతో ఊగిపోతూ కొడుకు మీదకు ఉరికింది.

మరుక్షణం "పనికివచ్చి మావాడిని వల్లో పడేసుకుందామనే! పాడు ముఖమా! వాడిని కాదే నిన్ను.... నిన్ను... పులుసులో ఎముక లేకుండా ఏరిపారేయ్యాలి."

అమ్మి జడ పట్టుకుంది.

"అమ్మా! దానినేం అనకు. నువ్వనుకుంటున్నంత కూడని పని ఏమీ జరిగిపోలేదు."

"ఇంకేం జరగాలిరా. కొత్త బట్టలు కొనిపెట్టావు. తగుదునమ్మా అని సింగారించింది చేతులు పట్టుకొని చెమ్మా చెక్కలాడబోతున్నారు. ఎప్పటినుంచిరా దౌర్భాగ్యుడా! ఈ రాసలీలలు!"


మధుబాబు మనస్సు ఉడికిపోయింది. అమ్మ ఎంతలేసి అభాండాలు వేస్తోంది. అవును, మరోలా ఆలోచించడానికి ఎంత విశాల హృదయం కావాలి.

"అమ్మా! అలాంటి మాటలన కు. రాసక్రీడలూ లేవు. రచ్చబండలూ లేవు. నేను వచ్చిన దగ్గరనుంచి అమ్మి అవస్థ మీ ఆడవాళ్ళ మూర్ఖత్వం చూస్తూనే ఉన్నాను. దాని స్థితిని అర్థం చేసుకొని, నువ్వో, చెల్లాయో నేను చేసిన ఈ పనిని మీరే చేసి ఉంటే ఇప్పుడిలా కాని మాటలాడవలసి వచ్చేదా? మీతో సమ స్థాయిలో ఉన్నవాళ్ళకి మీరేమైనా చేస్తారు. అమ్మిలాంటి అభాగ్యులు మీ కంటికానరు. వాళ్లు చేసే పనులు కావాలి. వాళ్ల బ్రతుకులతో పనిలేదు. చిరిగిన బట్టలు కట్టుకొచ్చినందుకు మీరంతా అమ్మిని ఎంత తిట్టి పోసారో గుర్తుతెచ్చుకో. మనిషిని మనిషిగా చూసి సాటి ఆడదాని అవస్థ మీరు అర్థం చేసుకుంటే నాబోటివాళ్ళకి ఈ అవసరం ఉండదమ్మా"

కొడుకు మాటలకి నిరుత్తారురాలై ఉండిపోయింది సావిత్రి.


తీక్షణంగా తల్లి కళ్ళలోకి చూసాడు. ఆ చూపులు తమ బోటి స్త్రీలందరినీ "ఏదీ స్త్రీ హృదయం" అని ప్రశ్నిస్తున్నట్టనిపించిందామెకి.

## అర్ధరాత్రి సూర్యుడు



మనకు సూర్యుడు పగలే కనిపిస్తాడు. కాని ఉత్తర ధృవ ప్రాంతంలో సూర్యుడు జూన్ నెలలో కొన్ని రోజులు రోజుకి 20 గంటలు మించి కనిపిస్తాడు. అంటే అర్ధరాత్రి కూడా కనిపిస్తాడన్న మాట. మెడ్నీ ద్వీపంలో (ఉత్తర ధృవ ప్రాంతం) సంవత్సరంలో 4 రోజులు, బేరింగ్ సముద్ర ప్రాంతంలో 15 రోజులు మాత్రమే సూర్యుడు కనిపిస్తాడు.

## కూరగాయలు



ప్రపంచం మొత్తం మీద నేడు 12 వేల రకాల కూరగాయలు పండుతున్నాయి. వీటిలో విరివిగా ఉపయోగించేవి 50 రకాలు మాత్రమే. మనం విరివిగా ఉపయోగించే బంగాళాదుంపలు గుమ్మడికాయల జన్మస్థానం అమెరికా ఖండంలోని పెరూ ప్రాంతం. టమోటాల జన్మస్థానం పశ్చిమ ఆసియా ప్రాంతం.

- డా॥ ఎ.ఎల్.ఆర్. మూర్తి